సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



జాతరకు చలో.. చలో.. 8లో

మాఘపౌర్ణమి నాడు సముద్రపు రేవులో పుణ్య స్నానాలు ఆచరించి తీరంలో వేంచేసియున్న **శ్రీ లక్ష్మీమాధవ స్వామిని దర్శించుకోనున్నారు.**



మహిళా కబడ్డీ విజేత విశాఖ

ఎం.కోడూరు మోదమాంబ తీర్థం సందర్భంగా నిర్వహించిన ఉత్తరాంధ్ర మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. 8లో

వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజనీర్‌గా వినయ్‌కుమార్

బీచ్‌రోడ్డు: వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజనీర్‌గా ఎం.వినయ్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీయూఎఫ్ఐడీసీలో చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వినయ్ కుమార్‌ను ఏడాది కాలం డిప్యూటేషన్‌పై వీఎంఆర్డీఏకి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

13న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో పలు సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ నెల 13న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నక్కపల్లిలోని హెటిరో ఫార్మాలో 200 ఖాళీలు, అచ్యుతాపురంలోని యొకొహోమా టైర్స్ తయారీ సంస్థలో 200 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 18-26 ఏళ్ల మధ్య వయస్సున్న, ఆసక్తిగల అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చొన్నారు. వివరాలకు 81432 77610 నంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, బచేలి-కిరండూల్ స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం కేకే లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(58501) పాసింజర్ ఈ నెల 13 నుంచి మార్చి 6వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ మార్చి 7వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి మార్చి 6వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ మార్చి 7వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. ఈ తేదీల మధ్య దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

'ఈ-శ్రమ్' పథకంలో నమోదుకండి

అనకాపల్లి టౌన్ : కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ శ్రమ్ పథకం ప్రవేశపెట్టిందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ ఇంచార్జి అధికారి కె. వసంతరావు కోరారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో 16 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయసు కలిగిన వ్యవసాయ రంగ కార్మికులు, ఆశా వర్కర్స్, వలస కార్మికులు, ఇళ్లలో, దుకాణాల్లో పనిచేయు కార్మికులు, కొరియర్ బాయ్స్, తోపుడు బండి వర్తకులు, మత్స్యకార కార్మికులు, పాల వ్యాపారులు, చేతి వృత్తి పనివారు, భవన నిర్మాణ రంగ కార్మికులు ఈ పథకానికి అర్హులని, ఈ పథకంలో నమోదుకు ఆధార్ కార్డు నకలు, దానికి లింక్ అయిన సెల్ ఫోన్ నెంబర్ ఉండాలని తెలిపారు. వారందరూ ఇ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ ఎటువంటి రుసుము చెల్లించకుండా ఉచితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇ-శ్రమ్ కార్డు కలిగిన కార్మికులు ప్రమాదవశాత్తూ మరణిస్తే బీమా రూ.2 లక్షలు, శాశ్వత అంగవైకల్యం కలిగితే రూ.2 లక్షలు, పాక్షిక అంగవైకల్యం కలిగితే లక్ష రూపాయలు సహాయం పొందుటకు అర్హులని వసంతరావు తెలిపారు.

మార్చి 17 నుంచి ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు

అనకాపల్లి : సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) 2024-25 పదో తరగతి పరీక్షల తేదీలను ప్రభుత్వం మార్చి 17 నుంచి 28వ తేదీ వరకూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్నట్టు డీఈవో గిడ్డి అప్పారావునాయుడు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ ఏడాది మార్చి 17న హిందీ, 19న ఇంగ్లిష్, 21న తెలుగు, కన్నడ, ఉర్దూ, ఒరియా, తమిళం, 24న గణితం, భారతీయ సంస్కృతి వారసత్వం, 26న శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, గృహవిజ్ఞాన శాస్త్రం, 28న సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.

వందేభారత్‌లో సిగరెట్ పొగ

- టీసీని నిలదీసిన ప్రయాణికులు



టీసీని నిలదీస్తున్న వందేభారత్ రైలు ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: వందేభారత్ రైలులో సిగరెట్ పొగ కలకలం సృష్టించింది. విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు సోమవారం ఉదయం బయల్దేరిన వందేభారత్ రైలు బాత్‌రూమ్‌లో ఓ ప్రయాణికుడు సిగరెట్ తాగాడు. బోగీ మొత్తం పొగ, సిగరెట్ వాసన రావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అక్కడికి వచ్చిన టీసీని నిలదీశారు. ట్రెన్‌లోని సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి.. సిగరెట్ తాగిన ప్రయాణికుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సదరు టీసీ తనకేం సంబంధం లేదని, తానేం చెయ్యలేనంటూ ప్రయాణికులతో వాదనకు దిగారు. ఈ వ్యవహారం మొత్తం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు.. సిగరెట్ తాగిన ప్రయాణికుడ్ని గుర్తించి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. **ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ లక్ష్యం. ఇదీ** తమ నినాదంగా చెప్పకునే **ఆర్టీసీ** యాజమాన్యం ఫస్ట్ ఎయిడ్ **బాక్సుల** నిర్వహణపై మాత్రం **శ్రద్ధ వహించడం** లేదు. బస్సు రోడ్డు ప్రమాదానికి **గురైతే** అప్పటికప్పుడు తాత్కాలిక వైద్య **సేవలు** పొందేందుకు ప్రతి ఆర్టీసీ బస్సులో **ఫస్ట్** ఎయిడ్ బాక్సు ఉండాలి. కానీ **ప్రస్తుతం** జిల్లాలో వివిధ ప్రాంతాలకు **ప్రయాణిస్తున్న** ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ **బాక్సులు ఎటు** వంటి ఔషధాలు లేకుండా **అలంకార** ప్రాయంగా దర్శనమిస్తు**న్నాయి.**





గాజువాక-యలమంచిలి బస్సులో తాళం లేకుండా అలంకారప్రాయంగా ఉన్న ప్రథమ చికిత్స పెట్టె



యలమంచిలి-విశాఖపట్నం 500వై బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సులో ఇతర వస్తువులు

ఆర్టీసీ బస్సులో... ఇవి అలంకారమేనా?

- ఫస్ట్ ఎయిడ్ పెట్టెల నిర్వహణ అధ్వానం
- కొన్ని బస్సుల్లో గడువు తీరిన మందులు, మరికొన్నింటిలో ఖాళీ బాక్సులు
- ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కూడా కరువే
- అమలుకాని మోటారు వాహన చట్టం
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- నిర్లక్ష్యం వీడాలంటున్న ప్రయాణికులు



పాయకరావుపేట-అనకాపల్లి బస్సులో ఖాళీగా ఉన్న ఫస్ట్ ఎయిడ్ పెట్టె

యలమంచిలి రూరల్ :

రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స ఎంతో అవసరం. ఏదైనా ప్రమాదం జరిగినపుడు మొదటి 15 నిమిషాలు ఎంతో విలువైనవి. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాలంటే ఆ సమయంలో చేసే చికిత్సే కీలకం. దీని నిమిత్తం అన్ని వాహనాల్లోనూ ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. కానీ ఆర్టీసీ బస్సుల్లో మాత్రం వీటి నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. పలు బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అలంకార ప్రాయంగా దర్శనమిస్తాయి. ఆర్టీసీ బస్సుల్లో ఉన్న ప్రథమ చికిత్స బాక్సుల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు మచ్చుకైనా కనిపించడం లేదు. కొన్ని బస్సుల్లో గడువుతీరిన మందులు, మరికొన్ని బస్సుల్లో ఖాళీ బాక్సులు, ఇంకొన్ని బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో ఇతర వస్తువులు కనిపిస్తున్నాయి. దీంతో ఏదైనా ప్రమాదం జరిగినపుడు ప్రైవేటు అంబులెన్సులు, ఆటోలు,108 వాహనాల కోసం ఎదురుచూడడం తప్ప మరో దారి లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో మందుల కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జిల్లాలో డిపోలు అనకాపల్లి, నర్సీపట్నం
రోజుకు ప్రయాణిస్తున్న బస్సులు : 200
రోజూ ప్రయాణించే వారి సంఖ్య : 50 వేలు
రోజుకు ప్రయాణించే దూరం : 64వేల కిలోమీటర్లు (సుమారుగా)

అమలు కాని చట్టం

కేంద్ర మోటారు వాహన చట్టం 1939 ప్రకారం ప్రయాణికుల వాహనాల్లో విధిగా ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేయాలి. ఈ చట్టాన్ని మరింత పటిష్టం చేస్తూ 1988లో మరిన్ని సవరణలు చేశారు. నిబంధనల ప్రకారం ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఇతర వస్తువులను ప్రథమ చికిత్స బాక్సుల్లో ఉంచాలి. లైసెన్సు పొందే ముందు బస్సు డ్రైవర్, కండక్టర్ తప్పనిసరిగా వారం రోజుల పాటు ప్రథమ చికిత్స చేయండంపై శిక్షణ పొందాలని, ప్రతి మూడేళ్లకోసారి లైసెన్సును పునరుద్ధరించుకోవాలని కూడా చట్టం నిర్దేశిస్తుంది. ప్రయాణికులు గాయపడితే వారికి ప్రథమ చికిత్స చేసే సామర్థ్యం బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఉంటుంది. రవాణా శాఖ అధికారుల నుంచి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందే సమయంలో మాత్రమే మొక్కుబడిగా ప్రథమ చికిత్స కిట్లను చూపుతున్నారు. ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికొదిలేస్తున్నారు. బస్సులు నడిపేటపుడు అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే ఒక్కోసారి కొందరు ప్రయాణికులు గాయపడుతున్న సందర్భాలు ఉంటున్నాయి. అలాంటప్పుడు ప్రథమ చికిత్స కిట్టు ఉంటే కొంతమేర ఉపశమనం ఉంటుంది.

పట్టించుకోని అధికారులు

ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో మందులు ఏర్పాటు చేయకపోతే బస్సులను సీజ్ చేసే అధికారం ఆర్టీవో స్థాయి అధికారులకు ఉంటుంది. అయినప్పటికీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీ నిర్వహణలో ఉన్న వాటిని ప్రభుత్వ బస్సులేనన్న భావనతో రవాణా అధికారులు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు న్నాయి.

అనుమతుల కోసం రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లినపుడు మాత్రమే అలంకార ప్రాయంగా వీటిని ఏర్పాటు చేస్తుంటారు. ఆ తర్వాత మళ్లీ కనిపించవు. ప్రతి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిస్పెన్సరీ ఉంది. అవి లేని చోట జిల్లా ఆస్పత్రులు ఉన్నాయి. ప్రథమ చికిత్స బాక్సుల్లో మందులు పెట్టాల్సి వస్తే ఆస్పత్రులకు ఇండెంట్ పెట్టి తీసుకోవచ్చు. అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు.

ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో ఉండాల్సిన సామగ్రి

ఎలాస్టిక్ బ్యాండేజ్ రోలర్స్	5
బెటాడిన్ ఆయింట్‌మెంట్ (యాంటీ సెప్టిక్ క్రీం)	1
డెట్టాల్ లేదా ఐయోడిన్	1
స్టెరిలైజ్డ్ కాటన్ బండిల్స్	2
నియోసిన్ పౌడర్ డబ్బా	1
సర్జికల్ బ్లేడ్	1
బర్నాల్ ఆయింట్‌మెంట్	1
వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్	1
బ్యాండ్ ఎయిడ్ ప్లాస్టర్లు	3
నైట్రోజన్ పెరాక్సయిడ్	1
దూది	1
స్పిరిట్, పెయిన్ కిల్లర్ మాత్రలు, కడుపు నొప్పి, జ్వరం, విరేచనాలకు మాత్రలు	

ఫస్ట్ ఎయిడ్ బాక్సులు కచ్చితంగా ఉండాలి



రెండ్రోజుల క్రితం పల్లె వెలుగు బస్సులో యలమంచిలి నుంచి అనకాపల్లి ప్రయాణించాను. తాళ్లపాలెం వద్ద డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. వెనుక ఉన్న ఇనుప రాడ్డును ఢీకొట్టడంతో నడుం నొప్పితో బాధపడుతున్నాను. ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు దిష్టి బొమ్మల్లా ఉంటున్నాయి. కనీసం ప్రాథమిక వైద్యానికి సంబంధించిన ఎటువంటి మందులు ఉండడం లేదు. అత్యవసర సమయంలో ప్రయాణికులకు అవసరమైన మందులను ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో ఉంచేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–బర్ల రమణ, యలమంచిలి

ప్రయాణికుల భద్రత ముఖ్యం



ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెల్లో మందులు ఉండడం లేదు. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న బస్సుల్లోనే నిబంధనలు పాటించకపోతే ప్రైవేటు బస్సుల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందనేది వాస్తవం. ప్రయాణికుల భద్రతకు నిజంగా విలువనిస్తే ఆర్టీసీ అధికారులు వెంటనే ప్రథమ చికిత్స పెట్టెల్లో అవసరమైన మందులు ఉంచడంతో పాటు, వాటి నిర్వహణను సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలి.

–నాగ అప్పారావు, ఏటికొప్పాక, యలమంచిలి మండలం

మందులు ఉంచుతాం



ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సుల్లో అవసరమైన మందులు ఉంచేలా డ్రైవర్లు, కండక్టర్లకు సూచించాం. వాటికి తాళాలు వేసి అత్యవసర సమయాల్లో తెరిచి ప్రథమ చికిత్స చేయాలి. ప్రతి నెలా ఫస్ట్ ఎయిడ్ బాక్సులను తనిఖీ చేసుకొని వాటిలో మందులు గడువు తీరితే వెంటనే వాటి స్థానంలో కొత్తవి ఉంచాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్సులను ప్రయాణికులకు ఉపయోగపడేలా నిర్వహిస్తాం. ఈ విషయంలో డ్రైవర్లు, కండక్టర్లు నిబంధనలు పాటించాలి.

–కె.పద్మావతి, జిల్లా ప్రజా రవాణా అధికారి, అనకాపల్లి

ముగిసిన నామినేషన్ల పర్వం

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి చివరి రోజు రెండు నామినేషన్ల దాఖలు
- మొత్తం 10 మంది నామినేషన్లు
- రేపు పరిశీలన, 13న ఉపసంహరణ



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న పెదపెంకి శివప్రసాద్



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న సుంకర శ్రీనివాసరావు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఆఖరి రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌కు సంబంధిత పత్రాలను అందజేశారు. అభ్యర్థుల చేత రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా, సోమవారం వరకు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల పర్వం ముగిసే సరికి 10 నామినేషన్లు దాఖలైనట్టు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ఉంటుంది. ఆ తరువాత పోటీలో ఎంతమంది ఉన్నారో స్పష్టమవుతుంది. అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తుల కేటాయింపు, ఇతర ప్రక్రియలు కొనసాగుతాయని కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ , నోడల్ అధికారి దయానిధి, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్లు వేసిన అభ్యర్థులు

కోసూరు రాధాకృష్ణ, పాకలపాటి రఘువర్మ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కోరెడ్ల విజయ గౌరి, నూకల సూర్యప్రకాశ్, రాయల సత్యనారాయణ, గాదె శ్రీనివాసులు నాయుడు, పోతల దుర్గారావు, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు.

జీకోడూరు సర్పంచ్ సస్పెన్షన్

మాకవరపాలెం : జీకోడూరు సర్పంచ్ బొడ్డేటి అమ్మాజీ లక్ష్మిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందాయని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. జీకోడూరు పంచాయతీలో 14వ, 15వ ఆర్థిక సంఘ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసినట్టు నిర్ధారణ కావడంతో సర్పంచ్ అమ్మాజీ లక్ష్మిని కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మూడు నెలలపాటు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని, ఉప సర్పంచ్‌కు సర్పంచ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు.

పిల్లల్లో నులిపురుగులు నివారించాలి

- కలెక్టర్ విజయకృష్ణన్
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి : పిల్లలందరూ నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకు స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్దహైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాలు వయసులోపు విద్యార్థులు ఒక ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని, మాత్రల వల్ల ఏవిధమైన ఇబ్బందులు ఉండవని, ఒక వేళ ఏమైనా ఇబ్బందులు తలెత్తినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఎవరైనా స్కూల్‌కి రాకపోతే మరలా ఈనెల 17న మాత్రలు పంపిణీ చేయాలని ఆమె కోరారు. నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలలు ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోకుండా అల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నులిపురుగుల వల్ల రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం వంటివి ఉంటాయిని ఆమె తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చేతులు, శుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లు ఉపయోగించిన తరువాత రెండు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఎండలు అధికంగా ఉంటాయని డీ హైడ్రేషన్ రాకుండా అందరూ తరచూ మంచినీరు తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పడాల రవికుమార్, డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు, జోనల్ కమిషనర్ బి.వి.రమణ, జిల్లా కార్యక్రమం అధికారి జె.ప్రశాంతి, ఎంఈవో ఎస్.కోటేశ్వరరావు, హెచ్ఎం బ్రహ్మాజీ పాల్గొన్నారు.

పక్కాగా 100 రోజుల ప్రణాళిక

- టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కసరత్తు
- జిల్లాలో 107 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 22,022 మంది విద్యార్థులు
- ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా
- జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు
- తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో రాత్రి ఆకస్మిక తనిఖీలు



తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఈవో అప్పారావునాయుడు

దేవరాపల్లి : పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు పక్కా ప్రణాళికతో కృషి చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి జి. అప్పారావు నాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని తెనుగుపూడి డా. బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల హాజరును, రికార్డులను పరిశీలించారు. వంద రోజుల విద్యా ప్రణాళికను తప్పనిసరిగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. విద్యార్థులపై ఒత్తిడి చేయకుండా ఇష్టపడి చదివే విధంగా సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి రోజూ ఉదయం 5 గంటలకు నిద్ర లేచి చదువుకొని, మరలా రాత్రి 10 గంటలకు వరకు చదివేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఉదయం 8 గంటల ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. రాత్రి వేళ పదో తరగతి విద్యార్థులు ఇంటి దగ్గర చదువుతున్నదీ లేనిదీ తెలుసుకునేందుకు వారి ఇళ్లను డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా సందర్శించి పర్యవేక్షిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మన జిల్లాలో మాత్రమే ఈ తరహా పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఈక్రమంలోనే తాను కూడా రాత్రి పూట గురుకుల విద్యాలయాలు, వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించడంతో పాటు విద్యార్థుల ఇళ్లకు సైతం వెళ్లినట్టు తెలిపారు.

జిల్లాలో 107 టెన్త్ పరీక్ష కేంద్రాలు

జిల్లాలో 107 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 407 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 22,022 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో ఆరు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించామని, సదరు కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, మంచి నీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కాగా పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయని డీఈవో పేర్కొన్నారు.

ఏరియా ఆస్పత్రికి రూ.20 లక్షల విలువైన సీఏఆర్ఎం మెషీన్

- తొలి శస్త్రచికిత్స చేసిన వైద్యులు



సీఏఆర్ఎం మెషీన్ ఉపయోగించి శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యుడు రవికిరణ్

నక్కపల్లి : స్థానిక 50 పడకల ఏరియా ఆస్పత్రికి ప్రభుత్వం రూ.20 లక్షల విలువైన ఆర్థోపెడిక్ వైద్యపరికరం (సి-ఏఆర్ఎం) మెషీన్‌ను సమకూర్చింది. ఈ పరికరాన్ని ఉపయోగించి ఆస్పత్రిలో వైద్యులు సోమవారం తొలి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. స్థానిక 30 పడకల ఆస్పత్రిని గత ప్రభుత్వం 50 పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది. అదనపు భవనాల కోసం రూ.3 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆస్పత్రిలో ఆధునిక సదుపాయాలతో అదనపు భవనాలు నిర్మించారు. ఆర్థోపెడిక్ సర్జన్‌ను కూడా నియమించడంతో ఏరియా ఆస్పత్రిలో ఏడాదిన్నర నుంచి ఆర్థోపెడిక్ వైద్య సేవలు కూడా అందుతున్నాయి. నియోజకవర్గంలో పాయకరావుపేట నుంచి పెనుగొల్లు వరకు సుమారు 30 కిలోమీటర్ల జాతీయ రహదారి ఉంది. నిత్యం ఈ రహదారిపై ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు సంభవించడం పలువురు క్షతగాత్రులవుతున్నారు. కాళ్లు చేతులు, ఎముకలు విరిగిన వీరికి శస్త్ర చికిత్సలు చేయాలన్నా 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనకాపల్లి, లేదా 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖపట్నం తరలించేవారు. లేదా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఇక్కడ ఆర్థోపెడిక్ సర్జన్‌ను నియమించి, రూ.14లక్షలతో ఆధునిక డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను సమకూర్చింది. అప్పటి నుంచి క్షతగాత్రులకు ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. అయితే పెద్ద ప్రమాదాలు జరిగి ఎముకలు విరిగితే శస్త్రచికిత్స చేయడం కోసం తాజాగా ప్రభుత్వం ఈ ఆస్పత్రికి రూ.20లక్షల విలువైన సి -ఏఆర్ఎం మెషీన్‌ను సమకూర్చింది. హోం మంత్రి అనిత ప్రభుత్వాన్ని కోరడంతో వారం రోజుల క్రితం ఈ పరికరాన్ని ఆస్పత్రికి కేటాయించారు. ఎముకలు విరిగి శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఈ పరికరంలో చూస్తూ విరిగిన ఎముకలను అతికించడం, స్క్రూలు, ప్లేట్లు వేయడం, కేవైరు ఉపయోగించడం వంటి వైద్య సేవలు అందించవచ్చు. ఈ సీఏఆర్ఎం పరికరాన్ని ఉపయోగించి సోమవారం బాధితుడికి ఆస్పత్రిలో తొలి శస్త్ర చికిత్స చేశారు. అడ్డురోడ్డుకు చెందిన అప్పలకొండ అనే వ్యక్తికి ప్రమాదంలో బొటన వేలు విరిగిపోయింది. ఇతనికి డిజిటల్ ఎక్స్‌రే తీసి విరిగిన బొటన వేలును సీఏఆర్ఎం పరికరం ఉపయోగించి శస్త్ర చికిత్స చేసినట్టు ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్ తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రిలో ఇటువంటి వైద్యం చేయించుకుంటే రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని వైద్య వర్గాలు చెబుతున్నాయి.



విరిగిన కాలి బొటన వేలు



శస్త్రచికిత్స అనంతరం వేలు

క్లుప్తంగా

ఉత్తరాంధ్ర మహిళా ఆహ్వాన కబడ్డీ విజేత విశాఖ



విజేతగా నిలిచిన విశాఖ మహిళా జట్టుతో ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబ తీర్థం సందర్భంగా నిర్వహించిన ఉత్తరాంధ్ర మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల వరకు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో విశాఖ జట్టు విజేతగా నిలిచింది. విజయనగరం జట్టు ద్వితీయ, అనకాపల్లి తృతీయ, పశ్చిమ గోదావరి జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.12వేలు, రూ.10 వేలు చొప్పున గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, పడాల అప్పల నాయుడు తదితరులు అందజేశారు. స్థానిక నాయకులు కలిమి శివ, జోన్నపల్లి నాగరాజు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. పోటీలను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

అబాకస్ పోటీలో ప్రతిభ



రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలో తృతీయ స్థానంలో నిలిచిన కలాం జోషిత్

కశింకోట: తాళ్లపాలెంలో ఉన్న గాయత్రి స్కూల్‌కు చెందిన 3వ తరగతి విద్యార్థి కలాం జోషిత్ రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచాడు. విజయవాడలో మూడు కేటగిరీల్లో ఈ పోటీలు జరిగాయి. ముందుగా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఈ పోటీల్లో పాల్గొన్న జోషిత్.. మూడో స్థానంలో నిలిచి బహుమతి పొందాడు. ఈ సందర్భంగా బాలుడిని పాఠశాల కరస్పాండెంట్ బి.రాంకుమార్ హెచ్‌ఎం వైనగష్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

అబాకస్ పోటీల్లో శ్రీభవానీ సత్తా

అచ్యుతాపురం: రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో శ్రీభవానీ విద్యా నికేతన్ విద్యార్థి బండారు కులదీప్ ప్రతిభకనబర్చారు. విజయవాడలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు హాజరు కాగా.. కులదీప్ తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు కూండ్రపు మూర్తి ప్రసాద్, కరస్పాండెంట్ సంతోష్ కుమార్, డైరెక్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, తల్లి దండ్రులు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మాఘపౌర్ణమి జాతరకు చలో.. చలో..



తీరంలో కొలువు తీరిన శ్రీలక్ష్మీ మాధవస్వామి

- రేవుపోలవరం తీరంలో చక్ర తీర్థం
- వాడపాలెంలో కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- పరవాడ డీఎస్పీ విశ్వస్వరూప్

ఎస్.రాయవరం : మాఘపౌర్ణమి జాతరకు రేవు పోలవరం తీరం సిద్ధం అయ్యింది. ప్రతి ఏడాది మాఘపౌర్ణమి నాడు సముద్రపు రేవులో పుణ్య స్నానాలు ఆచరించి తీరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీమాధవ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ జాతరకు లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా. చక్రతీర్థంగా పిలిచే జాతరలో భక్తులకు వివిధ ప్రభుత్వ శాఖలు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తారు. శ్రీ సత్యసాయి, స్థానిక యువజన సంఘాల సభ్యులు సేవా కార్యక్రమాలు చేపడతారు.

ఆర్టీసీ, పోలీస్ శాఖల ఏర్పాట్లు

తీరానికి ప్రధాన మార్గం ఉన్న అడ్డురోడ్డు నుంచి రేవు పోలవరం ప్రత్యేక బస్సులు అధిక సంఖ్యలో నడపనున్నారు. అనుమతులు లేని ప్రైవేటు వాహనాలు అడ్డురోడ్డు సమీపంలో నిలిపివేస్తారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించనున్నారు. అడ్డురోడ్డు, కొరుప్రోలు, గుడివాడ, రేవు పోలవరం జంక్షన్ల వద్ద ప్రత్యేక గస్తీ నిర్వహించి భక్తులను తరలించే ఏర్పాట్లు చేస్తారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. రేవులో



వాడపాలెం తీరంలో జాతర ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ విశ్వ స్వరూప్

భక్తుల పుణ్యస్నానాల సందర్భంగా ప్రమాదాలు తలెత్తకుండా గజ ఈతగాళ్లు రక్షణగా ఉంటారు. తీరం సమీపంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ శాఖ నుంచి ఉచితంగా తాగునీరు పంపిణీ, స్వచ్ఛంద సంస్థల వారు మజ్జిగ, చిరుప్రసాదాలు అందజేస్తారు.

శ్రీలక్ష్మీమాధవ స్వామికి అయిదు రోజుల సేవలు

రేవు పోలవరం తీరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీమాధవస్వామి మాఘపౌర్ణమి పురస్కరించుకుని అయిదు రోజుల పాటు ప్రత్యేక పూజలందిస్తారు. ఈ నెల 8న శనివారం నుంచి లక్ష్మీ మధవస్వామికి పూజలందిస్తూ భీష్మ ఏకాదశినాడు కల్యాణం నిర్వహించారు. సోమ, మంగళ వారాల్లో ప్రత్యేక హోమాలు నిర్వహించి పౌర్ణమినాడు అవభృతస్నానం, చక్రతీర్థం నిర్వహిస్తారు.

వాడపాలెంలో కట్టుదిట్టంగా ఏర్పాట్లు

రాంబిల్లి (యలమంచిలి) : మాఘపౌర్ణమి జాతరకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్టు పరవాడ డీఎస్పీ విశ్వ స్వరూప్ తెలిపారు. మాఘపౌర్ణమి జాతర సందర్భంగా రాంబిల్లి మండలం వాడపాలెం సముద్రతీర ప్రాంతాన్ని ఆయన సోమవారం మెరైన్, విపత్తులశాఖ, రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. రేవులో భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి అనువైన ప్రాంతాలను గుర్తించడం, ప్రమాదకరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు, ఇతర రక్షణ చర్యల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రాంబిల్లి సీఐ నరసింగరావు విలేకరులతో మాట్లాడుతూ 12వ తేదీన జరిగే మాఘపౌర్ణమి జాతర సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే భక్తులు విధిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రస్తుతం వాడపాలెం తీరం లోతుగా ఉండడంతో భక్తులంతా పోలీసులకు సహకరించి నిషేధిత ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాంబిల్లి సీఐ నరసింగరావు, మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, యలమంచిలి విపత్తులశాఖ అధికారి రాంబాబు, రాంబిల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధురి పాల్గొన్నారు.



పూడిమడక జగన్నాథ స్వామి ఆలయం

పూడిమడకకు ప్రత్యేక బస్సులు

అనకాపల్లి : మాఘపౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పూడిమడక సముద్రస్థానానికి 5 ప్రత్యేక బస్‌లు నడుపుతున్నట్లు డిపో ఇన్‌ఛార్జ్ మేనేజర్ వై.రవిచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తెల్లవారు జామునుంచి పూడిమడక సముద్రస్నానానికి వెళ్లే భక్తుల కోసం మరో 30 ప్రత్యేక బస్‌లు నడుపుతున్నట్టు తెలిపారు.

నేడే పూడిమడక జాగరణ

అచ్యుతాపురం : అందాల సహజ తీరం పూడిమడక ఒడ్డున మాఘ పౌర్ణమి వేడుకలకు ముస్తాబయ్యింది. లక్షకు పైగా జనాభా విచ్చేసే మాఘ పౌర్ణమి జాగరణ సందర్భంగా మంగళవారం రాత్రి సముద్ర తీరాన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. వివిధ తినుబండారాలతో కూడిన స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. బాణాసంచా విన్యాసాలు అలరించనున్నాయి. వారం రోజుల నుంచి జగన్నాథ స్వామి ఆలయంలో పూజలు ప్రారంభం అయ్యాయి. పూడిమడక ప్రధాన రహదారుల్లో విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధరాత్రి వరకూ జాతరను ఆస్వాదించనున్న మత్స్యకార కుటుంబీకులు, జిల్లా ప్రజలు రాత్రి అంతా జాగారం ఉంటారు. ప్రత్యేక బృందాలు, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు. బుధవారం తెల్లవారు జాము నుంచి పౌర్ణమి స్నానాలు ఆచరిస్తారు. ఇందుకోసం మొబైల్ బాత్‌రూంలు, బట్టలు మార్చుకునే షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే తీరంలో ప్రమాదస్థాయి లోపు భారీ తాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అనకాపల్లి నుంచి పూడిమడక వరకూ ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడపనున్నారు. అచ్యుతాపురం జంక్షన్ దాటిన తర్వాత ప్రైవేట్ వాహనాలను నియంత్రించనున్నారు. పూడిమడక హైస్కూల్ జంక్షన్ తర్వాత ఎటువంటి వాహనాలను అనుమతించే అవకాశం లేదని సీఐ గణేష్ తెలిపారు. జాతరకు ఏర్పాట్లపై పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ పర్యవేక్షించారు. స్థానిక పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులతో చర్చించారు. కాగా ఈ విడత జాతర వేడుకల ఏర్పాట్ల బాధ్యత నుంచి సర్పంచ్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. జాతరను తాము నిర్వహిస్తామని తేదేపా, జనసేన శ్రేణులు పోటీ పడ్డాయి. చివరకు రెండు వర్గాలు కలిసి జాతరను నిర్వహించాలని నిర్ణయించారు. జాతరల్లో మితి మీరిన రాజకీయ జోక్యం తగదని గంగపుత్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధిక లోడుతో వెళ్తున్న భారీ వాహనాలపై కేసులు

- పూడిమడక రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు
- మునగపాక పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ తుహిన్ సిన్హా



మునగపాక పీఎస్‌ను సందర్శిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

మునగపాక: పూడిమడక రోడ్డులో అధిక లోడుతో వెళ్తున్న భారీ వాహనాలపై కేసులు నమోదు చేస్తామని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. రహదారి విస్తరణ ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. మునగపాక పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది వివరాలు, పెండింగ్‌లో ఉన్న రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని, రాత్రి సమయంలో గస్తీ పక్కాగా జరిగేలా చూడాలన్నారు. పూడిమడక రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్‌తో పాటు పూడిమడక రోడ్డులో సైతం సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరిస్తూ ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించేలా చూడాలన్నారు. వివాదాలకు తావులేకుండా సాధ్యమైనంత వరకు స్థానికంగా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, యలమంచిలి సీఐ ధనుంజయరావు, ఎస్ఐ పి.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

అచ్యుతాపురం రూరల్ : మాఘ పౌర్ణమి పండగ సందర్భంగా జిల్లాలో పుణ్యస్నానాలు చేసే సముద్ర తీరప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ నెల 12వ తేదీన మాఘ పౌర్ణమి పండగ ఏర్పాట్లపై సమీక్ష చేశారు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడక, తంతడి గ్రామాల్లో, పరవాడ మండలంలోని తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, ఎస్.రాయవరం మండలంలో రేవుపోలవరం, పాయకరావు పేట మండలంలో పెంటకోట సముద్ర తీర ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే భక్తులకు తగు రక్షణ ఏర్పాట్లు, రవాణా, మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, పోలీస్ రక్షణ, పార్కింగ్, ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సిబ్బందిని నియమించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలని, ప్రజలను అప్రమత్తం చేయడానికి పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో ఉపయోగపడేలా అంబులెన్స్‌ను కూడా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సంబంధిత మండలాల అధికారులు పర్యవేక్షించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అధిక లోడుతో వెళ్తున్న మూడు లారీలకు జరిమానా



పోలీసులు స్వాధీనం చేసుకున్న అధిక లోడుతో వెళ్తున్న లారీలు

యలమంచిలి రూరల్: అధిక లోడుతో వెళ్తున్న మూడు లారీలను యలమంచిలి పట్టణ, ట్రాఫిక్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. రాంబిల్లి నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేటింగ్ బేస్(ఎన్ఏవోబీ) నిర్మాణ పనులకు బండరాళ్లను తరలిస్తున్న లారీలను పోలీసులు సోమవారం ఆపి తనిఖీలు చేయగా.. పరిమితికి మించి లోడుతో వెళ్తున్నట్టు గుర్తించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు రెండు, యలమంచిలి పట్టణ పోలీసులు ఒకటి మొత్తం మూడు లారీలను స్వాధీనం చేసుకుని అనకాపల్లి ఆర్టీవోకు అప్పగించారు. ఈ మేరకు ఒక్కో లారీకి రూ.62,000 చొప్పున జరిమానా విధించినట్టు పట్టణ ఎస్ఐ కె.సావిత్రి సోమవారం రాత్రి మీడియాకు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడును రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు.

యలమంచిలిలో సువర్ణ 'వైభవ'ం



జ్యోతి ప్రజ్వలన చేసి వైభవ్ జ్యువెలర్స్ షోరూం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, వైభవ్ సంస్థల సీఎండీ భారత మల్లికా రత్నకుమారి

- పట్టణంలో వైభవ్ జ్యూయలర్స్ 18వ షోరూం ప్రారంభం

యలమంచిలి రూరల్ : యలమంచిలి పరిసర ప్రాంత వినియోగదారులకు సౌలభ్యంగా వైభవ్ జ్యూయలర్స్ యాజమాన్యం కొత్తగా యలమంచిలి పట్టణంలో బ్రాంచిని ఏర్పాటు చేసింది. సోమవారం పట్టణ మెయిన్‌రోడ్డులో వైభవ్ జ్యూయలరీ యాజమాన్యం 18వ షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. యలమంచిలి వైభవ్ జ్యూయలరీని మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి, వైభవ్ సంస్థల సీఎండీ భారత మల్లికా రత్నకుమారి గ్రంధి, హోల్‌టైమ్ డైరెక్టర్ సాయి కీర్తన గ్రంధి, సీవోవో గొంట్ల రాఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేశ్ యలమంచిలి పట్టణంలో షోరూమ్‌ను ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రమకుమారి మాట్లాడుతూ యలమంచిలి పరిసర ప్రాంత వినియోగదారులు ఈ సేవలను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. వైభవ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ జె.రఘునాథ్ మాట్లాడుతూ వినియోగదారులకు అద్భుత శ్రేణిషాపింగ్ అనుభవంతో పాటు విస్తృత శ్రేణిలో 916 హాల్ మార్క్ బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్, 925 స్వచ్ఛత కలిగిన స్టెర్లింగ్ సిల్వర్ వస్తువులు యలమంచిలి వైభవ్ జ్యూయలరీలో అందుబాటులో వుంటాయని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన కాంటెస్ట్‌లో విజేతలకు వైభవ్ జ్యూయలరీ యాజమాన్యం బహుమతులను అందజేసింది. అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ బి.ఎస్.బంగారుశెట్టి, వీసం గోవింద్, బండారు రమేష్, ద్వారపురెడ్డి నాగేశ్వర్రావు, పలువురు పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.



షోరూం వద్ద సందడి

బెల్ట్‌షాపులతో గీత కార్మికుల ఉపాధికి గండి

అనకాపల్లి: జిల్లాలో బెల్ట్‌షాపులు పెరిగిపోవడంతో కల్లుగీత కార్మికుల ఉపాధికి గండి పడుతోందని జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు బత్తిన నాగేశ్వరరావు అన్నారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై పేపర్లలో ప్రకటనలు తప్ప నివారించడంలో విఫలమయ్యారన్నారు. గ్రామాల్లో ఒక్కో లైసెన్స్ దుకాణానికి 20 బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని, దీంతో కల్లుగీత కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కల్లుగీత కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. గీత కార్మికులకు మద్యం షాపుల టెండర్లకు ఈ ఏడాది జనవరి 27న నోటిఫికేషన్ ఇచ్చి ఫిబ్రవరి 5వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించి, ఎన్నికల కోడ్ వంకతో వాయిదాలు వేస్తోందన్నారు. బెల్ట్ షాపులను అరికట్టని పక్షంలో ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ గంటా శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి ఎర్రదేవుడు, ఎస్.తాతబాబు, జి.రాము, సతీష్, కె.పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్తిన నాగేశ్వరరావు

30 మంది ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



రక్తదాన శిబిరంలో జిల్లా ప్రజా రవాణాధికారి పద్మావతి, డిపో మేనేజర్ ధీరజ్

నర్సీపట్నం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి డిపో మేనేజర్ ధీరజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో 30 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ డ్రైవర్లలో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీలో ప్రయాణించడమే సురక్షితమనే భావన ప్రజల్లో కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతం కంటే ప్రస్తుతం ఆర్టీసీ ప్రమాదాలను తగ్గించగలిగామన్నారు. మాఘ పౌర్ణమి పురస్కరించుకుని రేవుపోలవరం సముద్ర స్నానాలకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపతున్నామన్నారు. కళ్యాణపులోవ, ధారమఠంకు ప్రత్యేక బస్సులను తిప్పేందుకు చర్యలు చేపట్టామన్నారు. భక్తులపై అదనపు చార్జీలు విధించటం లేదన్నారు. ఆర్టీసీ పార్సిల్ సర్వీసు సేవలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతుందన్నారు. గతేడాది పార్సిల్ సర్వీస్ ద్వారా రూ.1.70 కోట్ల ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది రూ.1.80 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు.

కొత్త కథ సిద్ధం..

- డైరెక్టర్ పరశురాం

కోటవురట్ల : డైరెక్టర్ పెట్ల పరశురాం కోటవురట్ల మండలం జల్లూరు శివారున జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. నాతవరం మండలం చెర్లోపాలేనికి చెందిన పరశురాం కోటవురట్ల మండలంలోని బి.కె.పల్లికి చెందిన ప్రముఖ డైరెక్టర్ పెట్ల పూరీజగన్నాథ్‌కు బంధువు. స్వశక్తితో ఎదిగి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న పరశురాం ఎల్లప్పుడూ కొత్తదనంతో దర్శకత్వం చేసేందుకు ప్రయత్నిస్తారు. ఆయన ఇప్పటి వరకు 8 సినిమాలకు దర్శకత్వం వహించగా గీతగోవిందం సినిమా మంచి పేరు తీసుకొచ్చింది. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత వాసిగా సినిమా ఇండస్ట్రీలో గుర్తింపు పొందినందుకు గర్వంగా ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 8 సినిమాలకు దర్శకత్వం వహించగా మరో సినిమాకు స్క్రిప్ట్ సిద్ధం అయ్యిందని, దిల్ రాజు నిర్మాతగా తెరకెక్కించేందుకు మెరుగులు దిద్దుతున్నట్టు తెలిపారు. ఈయనకు కైలాసపట్నానికి చెందిన లక్కబొమ్మల కళాకారుడు తంగేటి రాంబాబు తాను తయారు చేసిన మాతృమూర్తి బొమ్మను బహూకరించారు.



డైరెక్టర్ పరశురామ్‌కు లక్కబొమ్మను బహూకరిస్తున్న కళాకారుడు

భైకును ఢీకొన్న లారీ..ఒకరి మృతి

- మరొకరికి గాయాలు

అనకాపల్లి : మండలంలో జాతీయ రహదారి పిసినికాడ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ రవికుమార్ సోమవారం చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో రామునాయుడు కాలనీకి చెందిన వి.అశ్వనీ కుమార్, హర్షవర్ధన్‌లు ద్విచక్రవాహనంపై కశింకోటలో స్నేహితుడి జన్మదిన వేడుకలకు వెళ్లి ఆదివారం రాత్రి తిరిగి వస్తుండగా కశింకోట నుంచి అనకాపల్లి జాతీయ రహదారిలో వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న అశ్వనీకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, హర్షవర్ధన్ స్వల్పగాయాలతో స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హర్షవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించడం జరిగిందని, త్వరలో డ్రైవర్‌ను అరెస్టు చేస్తామన్నారు.

గల్లంతైన విద్యార్థి పవన్‌తేజ మృతదేహం లభ్యం



పవన్‌తేజ మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి మల్లికార్జునరావు

రాంబిల్లి (యలమంచిలి) : రాంబిల్లి మండలం వాడపాలెం సముద్రతీర ప్రాంతంలో ఆదివారం గల్లంతయిన ఇంజినీరింగ్ విద్యార్థి పవన్‌తేజ మృతదేహం సోమవారం లభ్యమైనట్టు రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు సోమవారం తెలిపారు. పవన్‌తేజ మృతదేహం వాడపాలెం సముద్రతీరం సమీపంలో లభ్యం కావడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. అక్కడ సూర్యతేజ, పవన్‌తేజ మృతదేహాలకు పోస్ట్‌మార్టం చేసి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ తెలిపారు. విద్యార్థుల మృతదేహాలను వారి స్వగృహాలకు తరలించి బంధువులు, స్నేహితులు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన విలేకరులకు తెలిపారు.

ఒడిశాలో నర్సీపట్నం వ్యక్తి మృతి

భువనేశ్వర్: ఖుర్దారోడ్ ప్రాంతంలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక గొలై బజార్ వద్ద సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో అపస్మారక స్థితిలో వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికుల దృష్టికి వచ్చింది. ఈ విషయం జట్నీ ఠాణా పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని తక్షణమే స్థానిక సాండుపూర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు నర్సీపట్నం బీసీ కాలనీకి చెందిన కర్రి సత్యనారాయణగా గుర్తించారు. మృతదేహాన్ని భువనేశ్వర్ క్యాపిటల్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.



సత్యనారాయణ మృతదేహం

మద్యం విక్రేత అరెస్టు

మునగపాక : మండలంలోని మడకపాలెం శివారు మద్య విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ వైఎల్ నాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మడకపాలెం శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సోమవారం నాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 15 మద్యం సీసాలతో పాటు సంబంధిత వ్యక్తి జాజుల సూరిబాబును అరెస్టు చేసినట్టు నాయుడు తెలిపారు.

రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

- కోర్టు భవనం పైనుంచి దూకిన ఖైదీ

విజయనగరం క్రైమ్: సబ్‌జైల్ నుంచి ఎస్కార్ట్ వాహనంలో విజయనగరం కోర్టుకు సోమవారం హాజరైన రిమాండ్ ఖైదీ... అదే కోర్టు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన ఐ.త్రిమూర్తులు ఐదేళ్ల కిందట విజయనగరం అమ్మవారి జాతరలో పరిచయమైన ఓ యువతిని ప్రేమించాడు. ఆమె ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చింది. పెళ్లి చేసుకోకపోవడంతో ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. జిల్లా కోర్టులో కేసు నడుస్తోంది. కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీచేసింది. గత నెలలో అనకాపల్లిలో అదుపులోకి తీసుకున్న నిందితుడి సబ్‌జైల్‌లో ఉంచారు. ఎస్కార్ట్ సాయంతో కోర్టు వాయిదాకు తీసుకువచ్చారు. వాయిదాకు వస్తాడని తెలిసి అమ్మ నాగమణి, మూడో అక్క నాగేశ్వరి సైతం కోర్టుకు వచ్చారు.

ఐదేళ్ల నుంచి వాయిదాలకు తిరుగుతున్నానని, బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుని చనిపోదామని నిర్ణయించుకుని మూడో ఫ్లోర్ నుంచి దూకేసినట్లు త్రిమూర్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే పోలీసులు, కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కాళ్లు, చేతులు, తలకు చిన్నపాటి గాయాలయ్యాయని, ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని టూటౌన్ పోలీసులు తెలిపారు.



విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్సపొందుతున్న త్రిమూర్తులు

క్లుప్తంగా

విద్యార్థులలో సృజనాత్మకత వెలికి తీయాలి



బహుమతులు సాధించిన విద్యార్థులు

అనకాపల్లి: విద్యార్థులలో సృజనాత్మకతను ఉపాధ్యాయులే వెలికి తీయాలని జీవీఎంసీ అనకాపల్లి జోన్ కమిషనర్ బి.వి. రమణ తెలిపారు. స్థానిక నర్సింగరావు పేటలోని ఏపీటీఎఫ్ భవనంలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలక్యూషన్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన రమణ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతిని కె. కుసుమ ప్రియ, ద్వితీయ బహుమతిని అమృత, తృతీయ బహుమతిని మనస్విని, కన్సోలేషన్ బహుమతులను పార్థు నాగచైతన్య, జె. జోత్స్న, బి. నాగ సంతోషి గెలుచుకున్నారు. కార్యక్రమంలో భారత వికాస్ పరిషత్ అనకాపల్లి అధ్యక్షుడు డి. శివరాము, కార్యదర్శి జి. లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎస్ గోపాలరావు పి నిర్మల, ఉపాధ్యాయులు ఓం రామ్, కేశవరావు, ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం పట్టణంలోని పలు కిరాణా దుకాణాల్లో దర్శనమిస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేదవాడికి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ నిత్యం పక్కదారి పడుతుందన్నారు. జిల్లా పౌరసరఫరా శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు.

బీసీ కమిటీ జిల్లా చైర్మన్‌గా రామచంద్రరావు

అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్‌గా సూరిశెట్టి రామచంద్రరావు నియమితులయ్యారు. రాష్ట్ర కమిటీ ఆదేశాలనుసరించి జిల్లా కమిటీలను ఎంపిక చేశామని ఏపీ బీసీ రాష్ట్ర చైర్మన్ అంగడాల పూర్ణ చంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏకగ్రీవంగా పాల్మన్‌పేట సహకార సంఘం ఎన్నిక



ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట: మండలంలో పాల్మన్‌పేట గ్రామంలో రామాంజనేయ మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎ-91 ఎన్నికలు సోమవారం నిర్వహించారు. మొత్తం 195 మంది సభ్యులకుగాను 42 మంది పాల్గొన్నారు. వీరందరూ కలిసి ఏడుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా కందాల లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్‌గా గరికిన దొండెమ్మ, డైరెక్టర్లుగా గరికిన రాణి, ముత్తి సూకరత్నం, గోసల మంగ, గోసల సత్యవతి, గవల భారతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టి.నాగమణి వారికి నియామక పత్రాలు అందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 10,847 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,500	4,630
మొదటి రకం	3,470	4.050
రెండో రకం	3,100	3,690
మూడో రకం	2,820	3,090

అనకాపల్లి సినిమాలు

దాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
ఒక పథకం ప్రకారం	: సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
పట్టుదల	: వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	: శ్రీసత్య(ఉదయం, మొదటి షో)
మదగజరాజ	: శ్రీసత్య(మెట్నీ, రెండో షో)
భవాని వార్డ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్-44 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 414 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 386 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ప్రాభవం కోల్పోతున్న రైల్వే స్టేషన్



కశింకోట రైల్వే స్టేషన్

- గతంలో 8 పాసింజర్లకు హాల్ట్
- ఇప్పుడు రెండు మాత్రమే..
- కరోనాలో రద్దయిన పాసింజర్ రైళ్లు
- కశింకోటలో ప్రయాణికుల ఇక్కట్లు



కశింకోట: ట్రాక్‌లు ఆధునికీకరణతోపాటు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రవేశ పెట్టి గొప్పగా చెప్పుకుంటున్న రైల్వే శాఖ చిన్న రైల్వే స్టేషన్ల అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తోంది. పేదల బండిగా చెప్పుకునే పాసింజర్ రైళ్లను క్రమక్రమంగా రద్దు చేస్తోంది. పర్యవసానంగా కశింకోట రైల్వే స్టేషన్ ప్రాభవాన్ని కోల్పోతోంది. ఈ స్టేషన్‌లో గతంలో రానూపోనూ 8 పాసింజర్ రైళ్లు ఆగేవి. ఇప్పుడు రెండు రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. దీంతో సరైన రవాణా సదుపాయం లేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. చార్జీల భారం ఎక్కువైనా బస్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. విశాఖపట్నం-విజయవాడ మార్గంలో కశింకోట రైల్వే స్టేషన్ ఉంది. ఇది సుమారు అర్ధ దశాబ్దం క్రితం ఏర్పడింది. కశింకోటతోపాటు చుట్టు పక్కల సంపతిపురం, వెదురుపర్తి, పిసినికాడ గ్రామాల్లో 30 వేల జనాభా కలిగి ఉంది. ఈ గ్రామాలతోపాటు ఇంకా మండల గ్రామాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులు నిత్యం ఎక్కువగా విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, సామర్లకోట, విజయవాడ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ పాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతాయి. అవి ఇప్పుడు అరకొరగా ఉన్నాయి. అందువల్ల అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఎక్కాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

4 రైళ్లే పునరుద్ధరణ...

ఈ స్టేషన్‌లో కరోనా రావడానికి ముందు వరకు రోజుకు 8 రైళ్లు ఆగేవి. విశాఖ-విజయవాడ, రాయిగడ- విజయవాడ, విశాఖ-కాకినాడ, విశాఖ-రాజమండ్రిల మధ్య రానూ పోనూ నడిచే 8 రైళ్లు ఆగేవి ఉండేవి. కరోనా సమయంలో వీటన్నింటిని రద్దు చేశారు. తర్వాత నాలుగు రైళ్లను పునరుద్ధరించారు. వాటిలో ప్రస్తుతం విశాఖ-కాకినాడ మధ్య నడిచే ఈఎంయూ రైళ్లు మాత్రమే రానూ పోనూ చెరొకటి వంతున నడుస్తున్నాయి. విశాఖ-రాజమండ్రి మధ్య నడిచే చెరో ఈఎంయూ రైలు సుమారు రెండు నెలలుగా నడపడం లేదు. దీన్ని ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి ఉంది. దీన్ని తరచుగా రద్దు చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనక తప్పడం లేదు.

అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సిందే....

గతంలో రాయగడ-విజయవాడ మధ్య నడిచే పాసింజర్ రైలును ఎక్స్‌ప్రెస్ చేసి గుంటూరుకు పొడిగించారు. దీనికి స్టాప్ ఇవ్వలేదు. ఇది అటు విజయవాడ, ఇటు విశాఖపట్నం వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి ఈ ప్రాంత ప్రజలకు అనువుగా ఉండేది. విశాఖ-విజయవాడల మధ్య రానూపోనూ నడిచే చెరో పాసింజర్ రైళ్లను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నడుస్తున్న విశాఖ-కాకినాడ మధ్య రైలు ఒక వైపు ఉదయం, మరో వైపు సాయంత్రం మాత్రమే నడుస్తుండటంతో ఈ ప్రాంత ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు రవాణా సదుపాయం లేక రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. రైళ్లు లేక ప్రయాణికులకు ఉపయోగపడక స్టేషన్ ప్రాభవాన్ని కోల్పోతోంది. అధిక వ్యయ ప్రయాసలకోర్చి అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకొని రాకపోకలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనిదృష్ట్యా గతంలో ఉండే పాసింజర్లను పునరుద్ధరించడంతోపాటు కనీసం విశాఖ-మచిలీపట్నం మధ్య నడిచే పాస్ట్ పాసింజర్ రైలును, ఎక్స్ ప్రెస్‌లను ఇక్కడ నిలపాలని ఈ ప్రాంత ప్రజలు చిరకాలంగా కోరుతున్నారు. ఇందుకు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాలంటున్నారు.

పాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి



ప్రస్తుతం కాకినాడ-విశాఖ మధ్య రైలు మాత్రమే రానూ పోనూ రాకపోకలు సాగిస్తోంది. రాజమండ్రి-విశాఖ రైలు రెండు నెలలుగా రద్దు చేశారు. దీంతో ఎక్కువగా అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గతంలో నడిచే పాసింజర్ రైళ్లను పునరుద్ధరించి ప్రయాణానికి .రవాణా సౌకర్యం మెరుగుపర్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాయి శ్రీనివాసరావు, కశింకోట

మచిలీపట్నం పాస్టు పాసింజర్‌కు హాల్టు ఇవ్వాలి



కశింకోట స్టేషన్‌లో ఇప్పుడు చెరో వైపు ఒక రైలు మాత్రమే నడుస్తోంది. దీంతో సమయానికి రైళ్లు లేక, గతంలో రద్దు చేసిన వాటిని పునరుద్ధరించక ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధిక చార్జీలను భరించి బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. పాసింజర్ రైళ్లను పునరుద్ధరించడంతోపాటు కొన్ని ఎక్స్‌ప్రెస్, కనీసం మచిలీపట్నం పాస్టు పాసింజర్ రైలుకు హాల్టు ఇవ్వాలి. – సయ్యద్ రజాక్ అలీ, కశింకోట

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐలు విజయ్‌కుమార్, వెంకటనారాయణ

అనకాపల్లి: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణ సీఐ టి.వి. విజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక నెహ్రూచౌక్ కూడలి అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబా సాహెబ్ అంబేడ్కర్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఈశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షుడు బోని గణేష్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మైలపల్లి పోతురాజు, కోనపల్లి సత్యనారాయణ, సూదికొండ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కుల చేతివృత్తుదారులకు శిక్షణ ప్రారంభం

అనకాపల్లి: కుల చేతివృత్తుల వారు అభివృద్ధి చెందాలంటే శిక్షణ అవసరమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు తెలిపారు. స్థానిక స్థానిక డేటాప్రో కార్యాలయంలో ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశిక్ యోజనలో భాగంగా కుల చేతి వృత్తుదారులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఐదు రోజులు పాటు జరిగే ఈ శిక్షణ తరగతులను పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ బ్యాంక్ లోన్ తీసుకొని సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో కట్టమూరు మంగరాజు, కొల్లి చిన్న నమిడితల్లి ఈశ్వరావు, డేటాప్రో కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బల్లల పండగ



గవరపేటలో రజకుల బల్లల పండుగ ఊరేగింపు



శారదా నది ఒడ్డున చాకిరేవు వద్ద రజకుల పూజలు

కశింకోట: స్థానిక గవరపేటలో రజకుల బల్లల పండుగ సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి మధ్య వీధిలోని తమ ఇళ్ల నుంచి సారె ఊరేగింపు ప్రారంభమైంది. పెద్ద గుమ్మం వద్ద ఉన్న చాకి రేవు వరకు డప్పులు, వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపు సాగింది. బాణసంచా కాల్చారు. అనంతరం చాకిరేవు వద్ద బల్లలకు సంప్రదాయంగా పూజలు చేశారు. సమీపంలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించారు.

లక్ష్యంతో ఉన్నత జీవితం సాధ్యం

నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న మాజీ వైస్ చాన్సలర్ ముత్యాలనాయుడు

కోటవురట్ల: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే ఉన్నత జీవితం సాధ్యపడుతుందని నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించవచ్చన్నారు. తల్లిదండ్రుల ఆశలను నిజం చేసేలా విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సత్యసాయి సేవా సమితి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయం అన్నారు. హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్, ఎంపీటీసీలు కాళ్ల రత్నం, యలమంచిలి ప్రకాష్, మాజీ సర్పంచ్ కాళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



తాళ్లపాలెంలో బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి మనీషా

కశింకోట: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం 94 శాతం మేర పూర్తయి విజయవంతమైంది. 19,276 మందికి ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. కశింకోట పీహెచ్‌సీ పరిధిలో 93 శాతం మేర కార్యక్రమం పూర్తయింది. మొత్తం 13,085 మంది పిల్లలుండగా, వారిలో 12,151 మందికి మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు తిరుపతిరావు, యశోద కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి ఎ. మనీషా అక్కడి ఏపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలతో ఆల్బెండజోల్ మాత్రలను నమిలి, చప్పరించి మింగించారు. నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఆవశ్యకతను వివరించారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి మింగించారు. మొత్తం 7,454 మంది పిల్లలుండగా, వారిలో 7,125 మందికి మాత్రలు అందించారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవలసిన ఆవశ్యకతను, లేదంటే ఉత్పన్నమయ్యే అనర్థాలను ఈ సందర్భంగా వివరించారు. నులి పురుగులు ఉండటం వల్ల రక్తహీనత ఏర్పడుతుందని, ఏకాగ్రత కొరవడుతుందన్నారు. దీని నివారణకు ప్రభుత్వం ఏడాదికి రెండు దఫాలు అందించే ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలన్నారు. ఇప్పుడు హాజరు కాని వారికి ఈ నెల 17న ఆరోగ్య సిబ్బందితో మాత్రలు అందించి మింగిస్తామన్నారు. ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి ఎ.వి. సుబ్బారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.ఎస్.ఆర్.కె. నరసింహారావు, ప్రిన్సిపాల్ జి. గ్రేస్, హెల్త్ అంబాసిడర్ బి.శ్రీదేవి, ఉపాధ్యాయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

అనకాపల్లి: గవరపాలెం మున్సిపల్ చిన్న హైస్కూల్‌లో 1993-94 సంవత్సరంలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. స్థానిక జాతీయ రహదారి తోటాడ జంక్షన్ కొబ్బరి తోటలో వీరంతా కలిశారు. ముందుగా పురాతన అహోబిల లక్ష్మీనరసింహ ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఒకరినొకరి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మూడు దశాబ్దాల క్రితం విద్యాభ్యాసం నాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో కాండ్రేగుల రామలింగేశ్వరావు, కోయిలాడ పరమేశ్, చాన్ బాషా, పెంటకోట పూర్ణచంద్రరావు, బోగేస్, ఆళ్ల శివాజీ, జగన్నాధరావు పాల్గొన్నారు.

కేకేసీ జిల్లా చైర్మన్‌గా రాము

పెందుర్తి: కాంగ్రెస్ పార్టీ అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల సంఘం(కేకేసీ) అనకాపల్లి జిల్లా చైర్మన్‌గా పెందుర్తికి చెందిన విన్నకోట రాము నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాము సోమవారం తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతల ప్రకారం కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

నేత్రపర్వంగా భావనారుషి కల్యాణం

అంగరంగ వైభవంగా శూలాల సంబరం




చుక్కలవాని లక్ష్మీపురంలో భావనారుషి కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లి: మండలంలో ప్రఖ్యాత గాంచిన చుక్కలవాని లక్ష్మీపురంలో భద్రావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. శూలాల సంబరాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన పద్మశాలీ సోదరులు ఏటా మాఘ మాసంలో ఈ వేడుకను వైభవంగా నిర్వహిస్తారు. సోమవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు పుష్పాలంకరణ, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం విబూది పండ్లు ఊరేగింపు జరిగింది. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. తదుపరి భజన కార్యక్రమం జరిగింది. సాయంత్రం 3 గంటలకు అమ్మవారి పుట్టింటి సారె ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు కోలాటం ఏర్పాటు చేశారు. తదుపరి నగర సంకీర్తన దీపోత్సవం జరిగింది. రాత్రి 7 గంటలకు అశ్వరథ ప్రతి కార్యక్రమం, మెగా డాన్స్ నిర్వహించారు. రాత్రి 12 గంటలకు శూలాల సంబరం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పద్మశాలీ భక్తులు శూలాలు నాలుకపై గుచ్చుకుని ప్రభలు పట్టుకుని నృత్యాలు చేస్తూ తెల్లవార్లు జాగరణ చేస్తూ ఊరేగింపు జాతర నిర్వహించారు. ఈ సంబరాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలి వచ్చారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీకరణ ఆకట్టుకుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ కర్రి గీతా రాజబాబు ఆధ్వర్యంలో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు.

జాతీయ విలువిద్య పోటీలకు తేజేశ్వరరావు



తేజేశ్వరరావుతో పాఠశాల యాజమాన్యం

పరవాడ: కోల్‌కతాలో ఈ నెల 13 నుంచి 15 వరకు జరగనున్న జాతీయ స్థాయి విలువిద్య పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న నల్లి తేజేశ్వరరావు పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి సోమవారం తెలిపారు. విశాఖలో గత నెల 22 నుంచి 25 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగంలో ఇండియన్ రౌండ్‌లో కాంస్య పతకం సాధించిన తేజేశ్వరరావు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థితోపాటు, కోచ్ గోవింద్, శివకుమార్‌లను విశాఖ ఆర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, విలువిద్య సంఘం కార్యదర్శి కె.నిశాంత్ అభినందించారు.

ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: పారిశ్రామికవాడగా దినదినాభివృద్ధిచెందుతున్న పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గనిశెట్టి మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం పరవాడలో ఈఎస్ఐ డిస్పెన్సరీ నిర్వహణ కోసం ఓ భవనం అద్దెకు తీసుకుని, ఒక రోజు కూడాడిస్పెన్సరీ తెరవకుండానే అద్దె చెల్లించారన్నారు. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు ఈఎస్ఐ వర్తింపు సౌకర్యం ఉన్నప్పటికీ స్థానికంగా ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో విశాఖలోని ఆస్పత్రిపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల్లో గాయపడిన కార్మికులకు స్థానికంగా అత్యవసర వైద్య సేవలు అందక, పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు వినతిపత్రం అందించి, ఆరు నెలలు కావస్తున్నా ఎలాంటి స్పందన రాలేదని ఆక్షేపించారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి చేయాలని, లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు ఎస్.అప్పలనాయుడు, పి.రమణ, డి.అప్పారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నర్సీపట్నం: మున్సిపాలిటీ శివారు సుబ్బరాయుడుపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. టౌన్ సీఐ జి.గోవిందరావు వివరాల ప్రకారం.. మాకవరపాలెం మండలం చంద్రయ్యపాలెంకు చెందిన వంటాకుల గంగాధర్(28) బైక్‌పై ఆదివారం రాత్రి నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో గ్రామదేవత పండగకు బంధువుల ఇంటికి వెళ్లాడు. పండగ చూసుకుని తిరిగి ఇంటికి వస్తూ పొగమంచు కమ్మేయడంతో అదుపు తప్పి సుబ్బారాయుడుపాలెం వద్ద చెట్టును ఢీకొట్టాడు. గంగాధర్ తలకు బలమైన గాయమైంది. 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.